# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

## క్రైస్తవ మాసపత్రిక

DECEMBER 2006

సంవత్సర చందా రూ. 50/-

సత్యవాణి ఇప్పుడు 'విస్సా' ఛానెల్ లో కూడ
ప్రతి గురువారం ఉదయం 7:00 గం॥
నుండి 7:30 గం॥ల వరకు చూడండి.

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న

సత్యవాణి టి.వి. కార్యక్రమములను

ప్రతి మంగళవారం : ఉదయం 6:30 గం॥లకు
'మా' టి.వి. లోను

ప్రతి గురువారం : 'విస్సా' ఛానల్ లో ఉదయం 7:00
గం॥లకు

ప్రతి శుక్రవారం : KTV లోను, IN లో ఉదయం
7:00గం॥లకు,సాయంత్రం
5:30గం॥లకు (కాకినాడలో మాత్రమే)

ప్రతి శనివారం : ఉదయం 6:30 గం॥లకు 'తేజ' ఛానల్
లోను చూడండి

ప్రసంగీకులు : బ్రదర్. జాషువా గూటం
బ్రదర్. లిక్కీ గూటం

సత్యసువార్తను వినండి !!

మీ బంధు మిత్రులకు విన్పించండి !!

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box - 80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722

Editor :
**Joshua Gootam**

*Pleading for Restoration of First Century Christianity*

సంపుటి 27 | డిసెంబర్ 2006 | సంచిక 5

## ఈ యేసు ఎవరు?

### (Who is This Jesus?)

యేసు ఎవరో అనే ప్రశ్న మన మధ్య చాల కాలము నుండి యున్నది. నేనెవరినని మనుష్యులు చెప్పుకొను చున్నారని యేసే తన్ను గూర్చి తన శిష్యులనడిగారు (మత్తయి 16:13). ఆయనను గూర్చి వలురకాల అభిప్రాయములు ప్రజలలో యున్నవని శిష్యులు చెప్పారు గాని ఆయన దేవుని కుమారుడే యుని పేతురు తన విశ్వాసాన్ని ప్రకటించాడు (మత్తయి 16:16).

ఈ లోకానికి క్రీస్తు ప్రముఖుడు. మన వుత్తరాలు దస్తావేజులు వగయిరా ఆయన జనన తేదీని బట్టి రికార్డు చేస్తాము. యేసు ఈ లోకమునకు రావడమే ఒక గొప్ప ఆశ్చర్యము. ఈ లోకంలో ఎవరు పలుకని గొప్ప మాటలను ఆయనే పలికారు. అత్యంత గొప్ప కార్యములు ఆయన చేతుల మీదుగానే చేయబడెను. అత్యంత గొప్ప దానం ఆయనే చేసారు. కల్వరిలో ఆయన తన స్వరక్తమిచ్చారు. మానవ

జాతి సాధించిన అభివృద్ధి యేమైనా వుంటే అది ఆయన మూలముననే సాధ్యమయ్యింది. ఇదంతా ఆయన చరిత్రేయని గ్రహించుకొననంతకాలము, చరిత్ర అంతా అగోచరంగానే యుంటాది.

ఈ యేసు ఎవరు? అని మనం అడిగితే వందజవాబులు వినబడతాయి. అనేక మంది క్రైస్తవులు తాము న్నస్థితిని బట్టి ఈ ప్రశ్నకు బదులు చెప్తారు. భవన నిర్మాణ ఇంజనీరుకు ఆయన ఒక గొప్ప వాస్తు శాస్త్రవేత్త, ముఖ్యమైన మూలరాయి. ఆకలిగొనిన వానికి ఆయన జీవాహారము, వైద్యునికి ఆయన పరమవైద్యుడు, సమాధుల కాపలా దారునికి ఆయన జీవమును పునరుత్థానమై యున్నారు. పుష్ప వర్తకునికి ఆయన షారోనులో పూసిన పుష్పము. ప్రేమించు యేసు అని చిన్న పిల్లలు ఆయనను గుర్తిస్తారు. బోధకులు ఆయనను గొప్ప బోధకునిగాను, ఉపదేశకులు గొప్ప ఉపదేశకునిగాను గుర్తిస్తారు. వడ్రంగులు ఆయనను తమలో ఒకడని ఎంచుకొంటారు. వ్యాధిగ్రస్థులకు ఆయన గొప్ప వైద్యుడు. చీకటిలోయున్నవారికి ఆయన వెలుగు, తృష్ణగొన్న వారికి ఆయన జీవజలము, కృంగినవారికి ఆయన గిలియాదు తైలము. జ్ఞానులకు ఆయన దేవుని జ్ఞానము. జాలరులకు ఆయన మనుష్యులను పట్టే జాలరుడు. అపరాధులకు ఆయన శిక్షవిధించే న్యాయాధిపతి.

మనలో ప్రతివాడు తానున్న పరిస్థితిని బట్టి ఆయనను గుర్తిస్తాము.

యేసును గూర్చి మనం యేమి ఊహించుకొను చున్నామో, ఆయన దానికంటే ఎంతో ఉన్నతుడు. ఆయన తనను గూర్చి చెప్పుకొన్నదానిని గుర్తిస్తే మనం ఎన్నడు నిరుత్సాహపడం. ఆయనను గూర్చి విన్న దానికంటే ఆయన ఎంతో ఎక్కువైనవాడు. ఆయన ప్రజలను ఆశ్చర్యపరుస్తారు (మత్త 7:28-29;8;27;9:8). ఆయన పనులను స్వయంగా పరికించినవారు. ఆయనను గూర్చి చెప్పుకొనుచు "అపరిమితముగా ఆశ్చర్యపడిరి" (మార్కు 7:37). "ఆయనే అల్ఫాయు ఓమెగయునై" యున్నాడు, ఆద్యంత ములు ఆయనే (ప్రక 1:8).

చీకటి గల చోటున వెలుగిచ్చు దీపమైన ఆయనను మనం పరికించితే

తెల్లవారి వేకువ చుక్కవలె మన హృదయాల్లో విశ్వాసము ఉదయిస్తాది (2 పేతురు 1:19). ఆయన వట్టి మాటలు చెప్పుకోలేదు. ఆయన దేవుని యొక్క సర్వపరిపూర్ణతయై యున్నాడు (కొలస్స 1:19). ఆయన శక్తిలోను జ్ఞానములోను మితములేని వాడు. కాలమునకు అతీతుడు, ఆయన సంవత్సరముల ఆరంభమును దినముల అంతమును లేనివాడు. ఆయన అతీతుడు, నిత్యుడు, మార్పులేనివాడు, దేవుడు.

## బైబిలును వ్రాసిన దెవరు?

(Who wrote the Bible ?)

బైబిలు గ్రంధమును వైజ్ఞానిక, చారిత్రక, భౌగోళిక దృక్పధాల్లో సూక్ష్మంగా పరిశోధించి చూచిన యెడల అది అన్ని విషయములలోను సత్యము అని మనకు తేట పడగలదు. గత కొద్ది సంచికలలో, వైజ్ఞానిక శాస్త్ర ప్రకారము బైబిలు ఎంత సత్యమైనదో గమనించాము. నిజానికి మానవ జ్ఞానమునకు అందనట్టి అనేక వైజ్ఞానిక సంగతులను గూర్చి బైబిలు గ్రంధము వేలకొలది సంవత్సరముల నుండి ప్రబోధించుచునేయున్నది. అంతేకాదు అది వర్తమాన, భూత, భవిష్యత్కాల సంగతులను గూర్చి చెప్పునప్పుడు అది నూటికి నూరుపాళ్ళు యధార్ధమునే చెప్పుచున్నది. బైబిలు గ్రంధము ఏ ఒక్క చిన్న విషయములోను కూడ అసత్యమని నిరూపింపబడలేదు. ఇంత గొప్ప గ్రంధము వ్రాసినది లేక వ్రాయించినది నిజానికి యెవరు? అనే ప్రశ్న మనకు సహజముగ రావచ్చును.

బైబిలునందు మొత్తము 66 పుస్తకములున్నవి. వాటిని దైవావేశము కలిగిన మనుష్యులు వ్రాసిరియని బైబిలు ఆరోపించుకొనుచున్నది. బైబిలును నమ్మువారు దేవుడే దానికి గ్రంధకర్తయని, ఆయన మనుష్యులతో పరిశుద్ధాత్మద్వారా మాటలాడగా వారు దానిని లిఖించిరియని నమ్ముదురు. బైబిలు అయితే అది దైవ ప్రేరితమైనదని తనను గూర్చి చెప్పుకొనుచున్నది. అది దేవుని వాక్యమైయున్నదని చెప్పుకొను చున్నది.

మోషే వ్రాసిన వ్రాతలన్నిటిలో, దేవుడు "అవన్నియును అతనికి వివరించి చెప్పెను" అని మనకు అది తెలియజెప్పుచున్నది (నిర్గమ 20:1). "యెహోవా ఆత్మ నాద్వారా పలుకుచున్నాడు. ఆయన వాక్కు నానోట ఉన్నదని" దావీదు పలికెను (2 సమూ 23:2). "యెహోవా మాటలాడుచున్నాడు. ఆకాశమా ఆలకించుము, భూమీ చెవి యొగ్గుము" అని యెషయా వ్రాసెను (యెషయా 1:2). "యెహోవా వాక్కు నాకు ప్రత్యక్షమాయెను" అని యిర్మీయా ప్రవక్త వ్రాసెను (యిర్మీ 1:4). "ప్రవచనము ఎప్పుడును మనుష్యుని యిచ్ఛను బట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మ వలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని పేతురు వ్రాసెను (2 పేతురు 1:21). అపొ.పౌలు గలతీయులకు ఇట్లు తెలియజేసెను: "సహోదరులారా, నేను ప్రకటించిన సువార్త మనుష్యుని యోచన ప్రకారమైనది కాదని మీకు తెలియజెప్పుచున్నాను. మనుష్యుని వలన నేను దానిని పొందలేదు, నా కెవడును దానిని బోధించలేదు. గాని యేసుక్రీస్తు బయలుపరచుట వలననే అది నాకు లభించినది" (గలతి 1:11,12).

ఇప్పటివరకు మనము చూచిన వాక్యములనుబట్టి బైబిలు లేఖకులు ఎవరు దానికి గ్రంథకర్తలమని చెప్పుకొనక వారి వ్రాతలన్నియును దైవావేశముచే కలిగినవని చెప్పుటలో ఏకీభవించియున్నారు.

బైబిలును కేవలము మానవులే వ్రాసిరి యని ప్రచారము చేయువారిని ఒక ప్రశ్న అడుగుచున్నాను. మనుష్యులు దానిని వ్రాసిరా? అయితే ఏతరగతి వారు? మానవలోక మంతటిని సజ్జనులని, దుర్జనులని, నీతిమంతులని, అనీతిమంతులని రెండు విధములుగ మనము చెప్పుకుంటూ యుంటాము. అందువలన ఏ తరగతి మనుష్యులు దానిని వ్రాసిరి? సజ్జనులు దానిని వ్రాసినట్లయితే బైబిలు ద్వారా లోకమంతటినీ స్పష్టముగ మోసగించిరని ప్రతివారు ఇట్టే తెలిసికొనగలరు. సజ్జనులు అబద్ధములాడగలరా? లేక అబద్ధికులు సజ్జనులు కాగలరా?

బైబిలు వ్రాసినవారు దుర్జనులా? దీనిని ఆలోచించునప్పుడు మనము కొంచెము సందిగ్ధావస్థలో పడవలసి

వచ్చుచున్నది. పాపమును బైబిలు ద్వేషించుచున్న రీతిగ మరొకటి ద్వేషించుటలేదు. పాపమును గూర్చి అది ఇట్లు చెప్పుచున్నది: "యెహోవాకు అసహ్యములైనవి ఆరు కలవు. ఏడును ఆయనకు హేయములు. అవేవనగా... అహంకార దృష్టియు, కల్లలాడు నాలుకయు, నిరపరాధులను చంపు చేతులును, దుర్యోచనలు యోచించు హృదయమును, కీడుచేయుటకు త్వరపడి పరుగులెత్తు పాదములును, లేనివాటిని పలుకు అబద్ధ సాక్షియు, అన్నదమ్ములలో జగడము పుట్టించువాడును" (సామె 6:16-19). "పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్ని గంధకములతో మండు గుండములో పాలుపొందుదురు. ఇది రెండవమరణము" అని ప్రకటన 21:8లో వ్రాయబడియున్నది. ఇప్పుడొక ప్రశ్న: బైబిలును వ్రాసిన వారు ఎంత దుర్మార్గులైనను, వారు చేయు పాపములను వారే ఖండించుచు, వాటివలన కలుగు కఠిన శిక్షను గూర్చి అందు వ్రాయగలరా?

దైవావేశపు కలమునకు భక్తుడైన యోహాను స్వస్తి చెప్పి ఇంచుమించు రెండువేల సంత్సరములు కాబోవుచున్నది. బైబిలును ఆనాటి మానవులే వ్రాసియుండిన యెడల, నేటి మానవులు అంతకన్న శ్రేష్ఠమైన బైబిలును వ్రాసియుండ వలసినదిగదా? కీర్తిశేషులు డా. విలియం జెన్నింగ్స్ బ్రాయన్ అనునతడొకసారి ఇట్లనెను: "మానవ అంతస్థును బట్టి నిర్ణయించిన, బైబిలు వ్రాయబడిన కాలముకంటె నేడు మానవులు దానిని వ్రాయుటకు ఎంతో అభివృద్ధి చెందియున్నారు. ఎవరి మాటలు, చేతలు బైబిలునందు వ్రాయబడెనో ఆ వ్యక్తులందరు ఒకే జాతికి చెందినవారు. నేడు మన దేశములకంటె ఏమంత పెద్దదికాని ఒకే దేశములో, పాలస్తీనా కొండలలో వారు నివసించిరి. వారికి అచ్చు యంత్రములు లేవు. విశ్వ విద్యాలయములు లేవు. చదువుకొనుటకు గొప్ప గ్రంథాలయములు వారికి ఆనాడు లేవు. భూనలువూలల నుండి వార్తల నందించుటకు టెలిగ్రాఫ్ తీగలుగాని, వార్తాపత్రికలనుగాని వారెరుగరు. పైన నక్షత్రములలోను, క్రింద బండలలోను

గల రహస్యములను బయలు పరచుటకు ఆనాడు విజ్ఞాన శాస్త్రమింకను తన తలుపులను తెరువనే లేదు. నేటి అమితవిజ్ఞాన వికాసమును బట్టి చూచిన అతి మిక్కిలి సంకుచితమైన విజ్ఞాన గృహము నుండి వారు ఆయా సంగతులను గైకొనినను, ఈ బైబిలు వ్యక్తులు ప్రపంచసృష్టి జరిగిన నాటినుండి సమాధి అనంతరపు మానవ జాతి సంగతుల వరకు అన్నిటిని గూర్చి చెప్పుచున్నారు. మానవుని జననము నుండి మరణము వరకు గల ఒక చిత్రపటమును వారు మనకిచ్చి యున్నారు.

"నిర్దేవులును, నాస్తికులును వారికి సాధ్యమయితే మనకున్న బైబిలుకంటే శ్రేష్ఠమైన బైబిలును తయారు చేయగలరేమో చూద్దాం. వారి బడులలో నున్న మేధావులందరినీ వారి నేర్పరచుకొననిమ్ము. వారి ప్రత్యేక సభ్యులు చూడదగిన స్థలములను చూడనిమ్ము గ్రంధాలయములను పరిశోధింపనిమ్ము. వారిని జీవ, వృక్ష, జంతు, రసాయనిక, భౌతిక, ఖగోళ, భూగర్భ శాస్త్రములు, మొదలగు నన్నిటిని పరిశోధింపనిమ్ము. కళలలోను, సాహిత్యములోను, చరిత్రలోను గల అభివృద్ధినంతటిని వారిని గైకొననిమ్ము. ఆయా శాఖలలోని విజ్ఞానసారమంతటి తోను ఒక గ్రంధమును తయారు చేసి దానిని బైబిలునకు బదులుగా వారిని లోకమున కీయనిమ్ము. అసలు వారాలాగున ప్రయత్నించగలరా? లేని యెడల వారేమని సాకు చెప్పగలరు? మానవుడు 2వేల సంత్సరముల క్రితమున్నట్టి స్థాయి నుండి క్రిందికి పడిపోయెనా? లేక మానవునికంటే ఉన్నతమైన స్థావరము నుండి బైబిలు మనకు లభించెనా? ఇందులో యేమి?"

బైబిలును మన చరిత్ర గ్రంధములతో పోల్చి చూచిన గొప్ప భేదము కన్పడు చున్నది. చరిత్రకారులు గొప్ప వ్యక్తులు జీవిత చరిత్రను వ్రాయునపుడు ఆ వ్యక్తుల సుగుణాలనే ఎత్తి చూపించుచు, దుర్గుణాలపై నిశ్శబ్దముగనుందురు. బైబిలు పాపమును ద్వేషించుటచే అందలి వ్యక్తుల సదలవాట్లనేగాక, వారి లోపములను కూడ బయలుపరచు చున్నది. మానవలిఖిత చరిత్రకును, బైబిలునకును గల ఈ భేదమును చూచిన తరువాత బైబిలు గ్రంధకర్త నిజానికి మానవుడు కాదని మన

మంగీకరించక తప్పదు.

బైబిలునందు గంభీరమైన ఏకత్వ మున్నది. వివిధ వృత్తులను కలిగి, వివిధ కాలములలో జీవించిన 40 మంది మనుష్యులచే 1600 సం॥లలో లిఖింపబడిన 66 పుస్తకములు సంపుటియే బైబిలు. వారందరు ఒకే ముఖ్యాంశమును గూర్చి అనగా పాపమునుండి మానవుని విమోచనను గూర్చి గొప్ప ఏకీభావమును కనబరచుచు వ్రాసిరి. అందువలన బైబిలును వ్రాసిన మనుష్యులు వేర్వేరు వ్యక్తులే అయినను వారిని నడిపించిన వాడు దేవుడేయని మనము నమ్మక తప్పదు.

బైబిలు మానవులందరికీ గొప్ప ఉపకారివలె యున్నది. జాతి,కుల,కాల వివక్షతలేక అందరి హృదయములను ఒడిసి పట్టుకొనగల్గిన సమాచారము అందు ఇమిడియున్నది. మానవులందరు పాపము చేసి దేవుడను గ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారని అది చెప్పుచున్నది (రోమా 3:23). అయితే పాపము వలన వచ్చు జీతము మరణము (రోమా 6:26). ఆ గొప్ప మరణము నుండి మనలను రక్షించుటకు యేసుక్రీస్తు నరునివలె ఈ లోకములో ఉద్భవించి, సిలువపై మరణించి, లేఖనముల ప్రకారము మూడవ దినమున సమాధి నుండి తిరిగి లేచెను. ఈ మంచి వార్తను నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును అని యేసుక్రీస్తు సెలవిచ్చుచున్నారు (మార్కు 16:16).

మీ పాపములనుండి విముక్తి పొందవలెనంటే బైబిలు బయలుపరచు రక్షకుని యొద్దకురండి. ఆయన మాటలను విని, విశ్వసించి, ఆయనకు లోబడుడి. నిర్దేవులు, నాస్తికుల వలన మీరు మోసపోకుడి. బైబిలు గ్రంథకర్త మానవుడు కాదు గాని నిత్య సత్య దేవుడని గ్రహించుడి. ప్రతి దినము దానిని పఠించి పరమానందము నొందుడి.

- జాషువా గూటం

# నేటి క్రైస్తవ సమాజంపై సాక్ష్యముల ప్రభావం

(గత సంచిక తరువాయి)

సాక్ష్యములు చెప్పువారు లేఖన విరుద్ధమైన మాటలు అనగా దేవుడు నాకు కనిపించాడు, నాతో మాట్లాడాడు, దేవుణ్ణి చూసాను, తాకాను అని నిరాధరమైన బోధలు చేస్తూ (1 యోహా 4:12, యోహా 14:17; 1 తిమో 6:16; కొల 1:15) క్రైస్తవులను, లోకమును మోసగిస్తున్నారు.

సాక్ష్యములు చెప్పువారు ఇహలోక సంబంధముగా దేవుడు వారికి చేసిన మేలులను గూర్చి సాక్ష్యమిస్తారు. ఆ మేలులను బట్టియే మనం క్రైస్తవులుగా మారకూడదు (రోమా 8:5-9). అలా ఏర్పడిన విశ్వాసం సరియైనది కాదు.

మన విశ్వాసము మనుష్యుల జ్ఞానమును ఆధారము చేసికొనక దేవుని శక్తిని, జ్ఞానాన్ని ఆధారము చేసికొని యుండవలెను (1 కొరింథీ 2:4-5). కానీ సాక్ష్యములు వినేవారు వినిన దానిని బట్టి విశ్వాసాన్ని స్థిరపరచుకొంటారు.

క్రైస్తవులు, బోధకులు క్రీస్తు సువార్తను గూర్చి ప్రకటించాలి. సువార్త అనగా యేసు మరణ సమాధి పునరుత్థానములను గూర్చి తెలియజేయుట (1 కొరింథీ 15:1-4). కానీ నేటి క్రైస్తవులు క్రీస్తును కాక వారి స్వవిషయ ములను గూర్చి సాక్ష్యముల రూపంలో తెలియజేయుట కడు శోచనీయం.

సాక్ష్యములు చెప్పాలని అందరిలో ఉంటుంది. కానీ చెప్పగల వాక్ చాతుర్యం, భావవ్యక్తీకరణ, సమయ స్ఫూర్తి, మనుష్యులను ఆకట్టుకొనే మాట నైపుణ్యం, సమాయానికనుగుణంగా పొడిగించడం లేదా తగ్గించడం, తియ్యని మాటలు ఉపయోగించడం వంటివి కొందరికే సాధ్యం. దీని కారణంగా దేవుని చిత్తాన్ని ఉన్నది ఉన్నట్లుగా బోధించడం సాధ్యంకాదు.

ప్రాచీన క్రైస్తవులు తమ బోధకుని మరియు అతని ఉపదేశము అలాగున్నవో లేవో అని లేఖనములను పరిశోధించుచూ వచ్చిరి (అపొ.కా. 17:11). కానీ నేటి సాక్ష్యములను పరిశీలించే అవకాశము లేదు.

వినుట వలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చి మాటవలన కలుగును (రోమా 10:17), సాక్ష్యముల వలన కాదు.

విభిన్న మతాల నుండి క్రైస్తవులుగా మారిన వ్యక్తులు సాక్ష్యముల రూపంలో వారి గాధను వివరిస్తూ ఇతర మతాల వారి లోపాలను ఎత్తి చూపుతూ, కించపరస్తూ వాఖ్యానాలు చేస్తారు.

ఆవిధంగా సాక్ష్యము చెప్పుట వలన ఆయా మతాల వారిచే విమర్శించ బడటమే కాకుండా భవిష్యత్తులో వారు ఎన్నటికీ క్రైస్తవులుగా మారకుండా వారే అడ్డుగోడలుగా నిలుస్తున్నారు. క్రీస్తును గూర్చి ప్రకటించి క్రైస్తవులలో విశ్వాసమును పెంపొందించాలి గానీ ఇతర మతాలలోని లోపాలను ఎత్తిచూపికాదు.

అబద్ధ బోధకులే క్రైస్తవులను సాక్ష్యములు వినేవారుగా ప్రోత్స హించుచు క్రైస్తవ విశ్వాసులు కూడా సాక్ష్యములను వినడానికే ఆసక్తి చూపుతున్నారు. బైబిలు మీద సమగ్రమైన పటుత్వం, జ్ఞానం కలిగిన వారెవ్వరూ సాక్ష్యములు చెప్పరు. వారు దేవుని వాక్యాన్ని చెప్పకుండా ఉండలేరు. సాక్ష్యములు చెప్పేవారు దేవుని వాక్యాన్ని ఉన్నది ఉన్నట్లుగా బోధించలేరు.

### నేటి సాక్ష్యములలో సాతాను?

సాతాను దుష్టుడు (మత్త 13:19), దేవునికి విరోధి (మత్త 12:30), సర్వలోకమును మోసపుచ్చుచున్నాడు (ప్రక 12:9). సాతానుకు దేవుని యొక్క శక్తిగల వాక్యము బోధింపబడటముగానీ, వినబడటం గానీ ఇష్టం ఉండదు. కల్పనా కథలు, కాలక్షేప సాక్ష్యములు, జ్ఞానయుక్తములైన తియ్యని మాటలు, మానవ కల్పిత పద్ధతుల ద్వారా దేవుని చిత్తానికి దూరపరచుట సాతాను లక్షణము. సర్వలోకం సాతాను భ్రమకు లోనై అధిక వ్యయంతో సువార్త సభలు నిర్వహిస్తున్నా దానిలో దేవుని వాక్యానికి ప్రాముఖ్యత లేకుండా సాక్ష్యములకే అధిక విలువ, సమయం, ప్రాముఖ్యత నివ్వడం చాలా విచారకరం. సాతాను బోధకుల రూపంలో క్రైస్తవుల మధ్యకు వచ్చి దేవుని వాక్యమును ప్రకటింప బడకుండా చేస్తున్నాడు. కాబట్టి వినేవారు నిశిత దృష్టితో పరిశీలన చేయవలసిన అవసరత ఎంతైనా ఉన్నది.

### వినేవారు గమనించవలసిన విషయాలు

1. సాక్ష్యములలో లోక సంబంధ విషయాలు ఎక్కువ ఉన్నాయా? లేక దైవ సంబంధ విషయాలు ఎక్కువ ఉన్నాయా?
2. సాక్ష్యము చెప్పిన వ్యక్తి బైబిలు నుండి ఎన్ని రిఫరెన్సులు ఇచ్చారు?
3. క్రీస్తు జీవిత చరిత్రను మించిన సాక్ష్యము ఈ లోకంలో ఎవరికైనా ఉంటుందా?
4. క్రీస్తు చరిత్రను చెప్పకుండా వారి చరిత్ర చెప్పుకోవడం ఎంత వరకూ సమంజసం?
5. సాక్ష్యము చెప్పేవ్యక్తి బైబిలు ట్రైనింగ్ చేసియున్నాడా? లేదా? (నూటికి 99% బైబిలు తర్ఫీదు లేనివారే అని గమనించండి).
6. దేవుడు "నేను మనుష్యుల వలన సాక్ష్యమంగీకరించను" అని

ఖచ్చితముగా తెలియజేస్తున్నాడు (యోహా 5:34). దేవుడు అంగీకరించని సాక్ష్యములను నీవు అంగీకరించగలవా?

7. నీ విశ్వాసము క్రీస్తుని బట్టి స్థిరపరచుకొంటున్నావా? లేక బోధకుని అద్భుత జీవితసాక్ష్యమును బట్టా?

8. వాక్య సారాంశమే సత్యము (కీర్త 119:160) నీ గురించి నీవు సాక్ష్యము చెప్పుకొంటే ఆ సాక్ష్యము సత్యముకాదు (యోహా 5:31). దేవుని దృష్టిలో సత్యముకాని సాక్ష్యము నీ దృష్టిలో సత్యమా?

9. సాక్ష్యము చెప్పే వ్యక్తి మునుపు దొంగ లేదా ఫాక్ష్యనిస్టు అయిన ఆ వ్యక్తి తను చేసిన నేరాలను చట్టం ముందు ఒప్పుకొని, శిక్ష అనుభవించాడా? లేక తన అపరాధములను చట్టం ముందు ఒప్పుకోకుండా సాక్ష్యము చెబుతున్నాడా?

10. దేవుని వలన కలిగిన బోధ, మనుష్యుల వలన కలిగిన బోధ అని రెండు విభిన్నమైన బోధలలో (యోహా 7:17-18) సాక్ష్యములు ఏ బోధలోకి వస్తాయి?

11. చమత్కారముగా కల్పించిన కథలను అనుసరించి యేసుక్రీస్తు యొక్క శక్తిని, ఆయన రాకడను తెలిపే మాటలు, క్రీస్తు మహాత్మ్యాన్ని కన్నులారా చూచినవారు చెప్పిన మాటలలో (2 పేతురు 1:16) సాక్ష్యములు ఏ పరిధిలోకి వస్తాయి?

12. క్రీస్తును గూర్చి ప్రకటించుట, మనుష్యులు తమకుతామే ప్రకటించుకొనుట (2 కొరింథీ 4:5-6)లో సాక్ష్యములు ఏ కోవకు చెందుతాయి?

13. మనుష్యుల వలన సాక్ష్యములను అంగీకరించేవారు దేవుని సాక్ష్యము మరీ బలమైనదను విషయాన్ని గమనించాలి (1 యోహా 5:9-10).

14. వాక్చాతుర్యముతోను, జ్ఞానాతిశయముతోనూ దేవుని మర్మమును ప్రకటించెడివారు, శిలువవేయబడిన యేసుక్రీస్తును తప్ప మరి దేనినీ ప్రకటించనివారు లోకములో ఉన్నారు (1 కొరింథీ 2:1-2). సాక్ష్యములు ఏ కోవకు చెందుతాయి.

**ఇప్పటికీ సాక్ష్యాలకే ప్రాముఖ్యత ఇచ్చేవారికి క్రీస్తు యిచ్చే సమాధానం**

యేసు - నేను చెప్పినది చేయక ప్రభువా, ప్రభువా, అని పిలచుట ఎందుకు? (లూకా 6:46). ప్రభువా అని నన్ను పిలచు ప్రతివాడునూ పరలోక రాజ్యములో ప్రవేశింపడుగానీ పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును (మత్తయి 7:21).

**-పి. మణికుమార్, గొల్లపాలెం.**

# దేవుని తీర్పు

(The Judgement of God)

ఆది యందు దేవుడు భూమ్యాకాశములను, భూమిపై సమస్త జీవరాసులను సృజించిన తరువాత ఆరవ దినమున మానవుని చేసెను. మానవుని యెదుట ఆయన జీవమును, మరణమును ఉంచెను. అతడు దేవునికి విధేయుడై జీవిస్తే నిత్యము జీవించును. అవిధేయుడైతే నిత్యమరణం అని అతనికి తెలియజేయబడెను. మానవుడు దేవుని ఆజ్ఞకు అవిధేయుడై పాపము చేసి దేవుని తీర్పుకు గురియయ్యెను. "మనుష్యులొక్కసారే మృతిపొందవలెనని నియమింపబడెను. ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:29). "ఎందుకనగా తాను నియమించిన మనుష్యుని చేత భూలోకమునకు తీర్పు తీర్చబోయెడియొక దినమును నిర్ణయించియున్నాడు"(అపొ.కా. 17:31). ఆ తీర్పు దినమున మనుష్యుని ప్రతి క్రియను తీర్పులోనికి తెచ్చును (ప్రసంగి 11:9).

## తీర్పుదినము

దేవుని గ్రంథములో తీర్పు దినము ఇట్లు వర్ణించబడినది.

**1. విమర్శ దినము:** నేను మీతో చెప్పునదేమనగా మనుష్యులు పలుకు వ్యర్థమైన ప్రతి మాటను గూర్చియు "విమర్శ దినమున" లెక్క చెప్పవలసియుండును (మత్తయి12:36).

**2. అంత్యదినము:** నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చువాడొకడు కలడు. నేను చెప్పిన మాటయే "అంత్యదినమందు" వానికి తీర్పు తీర్చును (యోహాను 12:48).

**3. మహాదినము:** మరియు తమ ప్రధానత్వమును నిలుపుకొనక తమ నివాస స్థలమును విడిచిన దేవదూతలను, "మహాదినమున" జరుగు తీర్పు వరకు కటిక చీకటిలో నిత్య పాశములతో ఆయన బంధించి భద్రము చేసెను (యూదా 1:6).

**4. ఆ దినము:** "ఆ దినమందు అనేకులు నన్ను చూచి ప్రభువా, ప్రభువా మేము నీ నామమున ప్రవచింపలేదా? నీ నామమున దయ్యములను వెళ్లగొట్టలేదా? నీ నామమున అనేకమైన

అద్భుతములు చేయలేదా? అని చెప్పుదురు. అప్పుడు నేను మిమ్మును ఎన్నడును ఎరుగను; అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండని వారితో చెప్పుదును (మత్తయి 7:22-23).

**II తీర్పు తీర్చు వారెవరు?**

"మరియు ఆయన మనుష్య కుమారుడు గనుక తీర్పుతీర్చుటకు (తండ్రి) అధికారము అనుగ్రహించెను" (యోహాను 5:27). యేసు ప్రభువు ఈ లోకానికి లోక ప్రజలకును, మనుష్యులందరికిని న్యాయము తీర్చు న్యాయాధిపతి.

"ఇదియు గాక దేవుడు సజీవులకును మృతులకును "న్యాయాధిపతినిగా" నియమించినవాడు ఈయనే అని ప్రజలకు ప్రకటించి దృఢసాక్ష్యమియ్య వలెనని మాకు ఆజ్ఞాపించెను. ఆయన యందు విశ్వాసముంచువాడెవడో వాడు ఆయన నామము మూలముగా పాపక్షమాపణ పొందునని ప్రవక్తలందరు ఆయనను గూర్చి సాక్ష్యమిచ్చు చున్నారనెను"(అ.కా. 10:42-43).

"తన మహిమతో మనుష్య కుమారుడును ఆయనతో కూడ సమస్త దూతలును వచ్చునప్పుడు ఆయన తన మహిమ గల సింహాసనము మీద ఆసీనుడై యుండును. అప్పుడు సమస్త జనములు ఆయన ఎదుట పోగు చేయబడుదురు"(మత్తయి 25:31).

**III.తీర్పులోనికి వచ్చువారు ఎవరు?**

"మరియు ధవళమైన మహా సింహాసనమును దాని యందు ఆసీనుడైయున్న యొకనిని చూచితిని. భూమ్యాకాశములు ఆయన సముఖము నుండి పారిపోయెను. వాటికి నిలువ చోటు కనబడకపోయెను,మరియు గొప్ప వారేమి కొద్దివారేమి మృతులైన వారందరు ఆ సింహాసనము ఎదుట నిలువబడియుండుట చూచితిని అప్పుడు గ్రంథములు విప్పబడెను, మరియు జీవగ్రంథమను వేరొక గ్రంథము విప్పబడెను, ఆ గ్రంథముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి" (ప్రకటన 20:11-13). "ఎందుకనగా తాను జరిగించిన క్రియల చొప్పున, అవి మంచివైనను సరే చెడ్డ వైనను సరే, దేహముతో జరిగించిన

వాటి ఫలమును ప్రతివాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయ పీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును"(II కొరింధీ 5:10).

దేవదూతలు పాపము చేసినప్పుడు దేవుడు వారిని విడిచి పెట్టక, పాతాళలోక మందలి కటిక చీకటి గల బిలములోనికి తోసి, తీర్పుకు కావలిలో ఉంచబడుటకు వారిని అప్పగించెను(II పేతురు 2:4).

కాబట్టి భూలోకములో జీవించే వారందరు క్రీస్తు న్యాయ పీఠము ఎదుట జరిగే తీర్పునకు హాజరు కావలెను గాని ఎవడును తప్పించుకొన వీలులేదు.

## IV. తీర్పునకు ఆధార గ్రంధములు

"అప్పుడు గ్రంధములు విప్పబడెను మరియు జీవగ్రంధమను వేరొక గ్రంధము విప్పబడెను. ఆ గ్రంధముల యందు వ్రాయబడియున్న వాటిని బట్టి తమ క్రియల చొప్పున మృతులు తీర్పుపొందిరి.

"ఎవని పేరైనను జీవ గ్రంధమందు వ్రాయబడినట్లు కనబడని యెడల వాడు అగ్ని గుండములో పడవేయబడెను" (ప్రకటన20:15).

"మరియు యెహోవా యందు భయభక్తులు కలిగి ఆయన నామమును స్మరించుచు ఉండువారికి జ్ఞాపకార్ధముగా ఒక గ్రంధము ఆయన సముఖమునందు వ్రాయబడెను"(మలాకీ3:16).

"నియమింపబడిన దినములలో ఒకటైన కాకమునుపే నా దినములన్నియు నీ గ్రంధములో లిఖితము లాయెను (కీర్తనలు 139:16).

"అందుకు యెహోవా - ఎవడు నా యెదుట పాపము చేసెనో వానిని నా గ్రంధములో నుండి తుడిచివేయుదును" (నిర్గమ 32:33).

## V.తీర్పునకు సాక్ష్యములు

"నేను నెరవేర్చుటకై తండ్రి యే క్రియలను నాకిచ్చియున్నాడో నేను చేయుచున్న ఆ క్రియలే తండ్రి నన్ను పంపియున్నాడని నన్ను గూర్చి సాక్షమిచ్చు చున్నవి" (యోహాను 5:36).

మన క్రియలే మన మీద సాక్షులు ఒకడు చేయు క్రియలు అతని మీద సాక్ష్యము పలుకును.

"మనుష్యుల ఎదుట నన్ను ఒప్పుకొను వాడెవడో పరలోకమందున్న నా తండ్రి ఎదుట నేనును వానిని ఒప్పుకొందును" (మత్తయి 10:32). "నేను ఆకలి

గొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి, దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి, పరదేశినై యుంటిని నన్ను చేర్చుకొంటిరి, దిగంబరినై యుంటిని, నాకు బట్టలిచ్చితిరి, చెరసాలలో ఉంటిని నా యొద్దకు వచ్చితిరని ప్రభువు నీతిమంతులను గూర్చి తీర్పు దినమున సాక్ష్యము పలుకును. అందుకు నీతిమంతులు - ప్రభువా ఎప్పుడు నీవు ఆకలిగొని యుండుట చూచి నీకాహారమిచ్చితిమి. అందుకు ప్రభువు మిక్కిలి అల్పులైన ఈ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును (మత్తయి 25:35-40).

గనుక మనుష్యులు చేసిన మంచి పనులను న్యాయాధిపతి అంగీకరించి సంతోషించుచున్నారు. ఇలాంటి ప్రేమకార్యములు మన కొరకు సాక్షమిచ్చును.

## VI.తీర్పు సమయము

ఆ దినమును గూర్చియు ఆ గడియను గూర్చియు తండ్రి తప్ప ఏ మనుష్యుడైనను, పరలోకమందలి దూతలైనను, కుమారుడైనను ఎరుగరు! జాగ్రత్తపడుడి, మెలకువగా నుండి ప్రార్థన చేయుడి. ఆ కాలమెప్పుడు వచ్చునో మీకు తెలియదు. ఒక మనుష్యుడు తన దాసులకు అధికారమిచ్చి, ప్రతి వానికి వాని వాని పని నియమించి మెలకువగా నుండుమని ద్వార పాలకునికి ఆజ్ఞాపించి, ఇల్లు విడిచి దేశాంతరము పోయినట్టే (ఆ కాలము ఉండును). ఇంటి యజమానుడు ప్రొద్దుగ్రుంకి వచ్చునో, అర్ధరాత్రివచ్చునో, కోడికూయు నప్పుడు వచ్చునో తెల్లవారునప్పుడు వచ్చునో యెప్పుడు వచ్చునో మీకు తెలియదు. ఆయన ఆకస్మాత్తుగా వచ్చి మీరు నిద్రపోవుచుండుట చూచునేమో గనుక మీరు మెలకువగా నుండుడి. నేను మీతో చెప్పునది అందరితోను చెప్పుచున్నాను. మెలకువగా నుండుడనెను (మార్కు 13:32-37).

మనుష్య కుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడా రాబోవుచున్నాడు. అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును (మత్తయి 16:27).

అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును. ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించి పోవును, పంచభూతములు మిక్కటమైన వేంద్రముతో లయమైపోవును, భూమియు దానిమీద నున్న కృత్యములును కాలిపోవును. ఇవన్నియు ఇట్లు లయమైపోవునవి గనుక, ఆకాశములు రవులుకొని లయమై పోవునట్టియు, దేవుని దినపు రాకడ కొరకు కనిపెట్టుచు, దానిని ఆశతో అపేక్షించుచు, మీరు పరిశుద్ధమైన ప్రవర్తనతోను, భక్తితోను, ఎంతో జాగ్రత్తగల వారై యుండవలెను. అయినను మనమాయన వాగ్దానమును బట్టి క్రొత్త ఆకాశము కొరకును, క్రొత్త భూమి కొరకును కనిపెట్టుచున్నాము. వాటి యందు నీతి నివసించును (II పేతురు 3:10-13).

**ముగింపు:**

ప్రియమైన సహోదరి సహోదరులారా దేవుడు మనలను ప్రేమించి భూలోకములో ఆయనకు విధేయులుగా జీవించాలని ఆయన ఆశ కలిగి యున్నాడు. తీర్పు దినమున - "నాతండ్రిచేత ఆశీర్వదింపబడిన వారలారా, రండి, లోకము పుట్టినది మొదలుకొని మీ కొరకు సిద్ధపరచబడిన రాజ్యమును స్వతంత్రించుకొనుడి" అని మన ప్రభువుచే పిలువబడి మన కొరకు సిద్ధపరచిన రాజ్యము (పరలోకరాజ్యం) లోనికి ప్రవేశించడానికి సిద్ధ మనస్సు అనే జోడు తొడుగుకుని ఆసక్తితో ప్రభువు సన్నిధిలో ఉండాలని మన ప్రభువును రక్షకుడైన క్రీస్తు పేరిట వేడుకొను చున్నాను.

**- పి. ప్రకాశం, హైదరాబాద్**


**గమనిక: సత్యవాక్కు కావలసిన వారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.**

SATYA VANI,P.O.BOX-80, KAKINADA - 533 001.

ప్రకటన గ్రంథ ప్రసంగమాలిక -5

# యెజెబెలు సంఘము - తుయతైర

(The Chruch of Jezebel)

(ప్రకటన 2:18-29)

## పరిచయము:

తుయతైరలో యున్న సంఘము చాల చిన్నది. గాని దానికి పంపబడిన వర్తమానము చాల పెద్దది.

1. లూదియ ఈ పట్టణస్థురాలు (అపొ.కా. 16:14).

2. ఈ పట్టణంలో ఉన్ని పరిశ్రమ వుండేది, మరియు అద్దకపు రంగులు అక్కడ లభించేవి. మ్యూరెక్స్ అనే బిళ్లచేప యొక్క గొంతునుండి ఆ రంగులు తయారు చేయబడేవి. ఆ రంగులు చాల విలువైనవి.

3. తుయతైరలో వర్తకసంఘాలు, సంస్థలు అనేకముండేవి.

4. ఈ పట్టణంలో అపొల్లోయనే దేవుని ఆరాధించేవారు. అర్తెమిదేవి యొక్క గుడి కూడ అక్కడ వుండేది.

5. సంబతే అనే సోదెచెప్పు స్త్రీ అక్కడ వుండేది.

6. ప్రకటన 2:18-29 చదువుము.

## I. క్రీస్తు యొక్క వర్ణన:

A. ఆయన దేవుని కుమారుడని వర్ణించబడెను. తుయతైరలో అపొల్లో దేవుని సూర్యుడని పిలువబడేవాడు. క్రీస్తు Sun of God కాదు గాని Son of God అని చెప్పబడెను. ఆయన ప్రవక్త, అపొస్తలుడు గాక దేవుని కుమారుడు.

1. "నీవు నా కుమారుడవు, నేడు నిన్ను కనియుంటినని" కీర్తన 2:7లో చెప్పబడియున్నది. "కుమారుని ముద్దు పెట్టుకొనుడి లేని యెడల ఆయన కోపించును; అప్పుడు మీరు త్రోవ తప్పి నశించెదరు" అని కీర్తన 2:11 చెప్పుచున్నది.

2. యేసుక్రీస్తు ఒక్కరు మాత్రమే దేవుని "అద్వితీయ కుమారుడు" (యోహాను 3:16).

3. ఈ దినముల అంతమందు దేవుడు కుమారుని ద్వారా మనతో మాటలాడెను (హెబ్రీ 1:1-2).

4. యేసు దేవుని కుమారుడని మనందరం ఒప్పుకోవాలి. అట్లు ఆయనను ఘనపరచుదుము (I యోహా 4:15; యోహా 5:22-23).

**B. ఆయన "కన్నులు అగ్ని జ్వాలల వంటివి"**

క్రీస్తు సర్వజ్ఞానియై యున్నారు (హెబ్రీ4:13). ఆయన సమస్తమును చూచును.

**C. ఆయన పాదములు అపరంజిని పోలినవి.**

క్రీస్తు సర్వశక్తిమంతుడు; సర్వాధికారి (ప్రక 1:8).

**II. క్రీస్తు తుయతైర సంఘమును అభినందించారు (19వ).**

A. "నీ క్రియలను నేనెరుగుదును" వారి పనులన్నియు ఆయనకు ఎరుకే, ఆయనకు తెలియనిది యేదీ లేదు.

B. నీ ప్రేమను నేనెరుగుదును.

1. వారు ఒండొరులను ప్రేమించిరి (యోహా 13:34-35).

2. వారు ప్రేమ వలన పురికొల్పబడిరి (I. కొరింధీ 13:1-3).

C. క్రీస్తువారి విశ్వాసమును, పరిచర్యను ఎరుగును.

1. వారి విశ్వాస్యతను క్రీస్తు ఎరుగును. విశ్వాసమనగా... (హెబ్రీ 11:6; యాకోబు 2:24,26).

2. క్రీస్తు పరిచర్యచేయుటకు వచ్చారు (మత్త 20:28). క్రైస్తవులు తప్పక పరిచర్య చేయాలి (I కొరింధీ 16:15;ఎఫెసీ 4:12;గలతీ 6:10;తీతు 3:1,8,14).

D. ఈ క్రైస్తవుల సహనమును క్రీస్తు అభినందించారు. వారు ఎడతెగక సహించారు. శ్రమ, పరీక్ష ఓర్పును కలుగజేయునని పౌలు యాకోబు బోధించారు (రోమా 5:3; యాకోబు 1:2).

E. వారి మొదటి క్రియల కన్న కడపటి క్రియలు ఎక్కువైనందున ప్రభువు వారిని ప్రసంసించారు. ఎఫెసులో యున్న సంఘమునకు వీరు భిన్నముగా కనబడుచున్నారు (ప్రక 2:4-5).

**III. క్రీస్తు యొక్క అభిశంసన (10-23వ).**

A. వారు యెజెబెలు అను స్త్రీని వారి మధ్య ఉండనిచ్చారు. ఆమె జారత్వము చేయుటకును, విగ్రహములకు బలియిచ్చిన వాటిని తినుటకును ఆమె వారికి బోధించుచు, మోసపుచ్చు చుండెను ఆమె యొక ప్రవక్త్రినని చెప్పుకొనుచున్నందున అట్లు చేయగలిగినది. ఎఫెసులో హితబోధ యుండెను గాని, ప్రేమలేదు తుయతైరలో ప్రేమ యున్నది గాని హితబోధలేకుండెను.

1. ఈమె పాతనిబంధనలో కనబడు యెజెబెలు కాదు. ఆయెజెబెలుసీదోను

రాజు యొక్క కుమార్తె అహాబు రాజును పెండ్లి చేసికొనెను. బయలు, అష్తారోతు దేవతల విగ్రహారాధనను ఆమె ఇశ్రాయేలులో ప్రవేశపెట్టెను. నాబోతుయొక్క ద్రాక్షతోటను ఆక్రమించుకొని అతని ఆమె హత్యచేయించెను. ఆమె ఘోర మరణం పాలైనది (2 రాజులు 9:30-37).

2. తుయతైరలో యున్న యెజెబెలు ఆ సంఘం బోధకుని భార్యయై యుండవచ్చని కొందరు తలుస్తారు. లేదా సంఘ పెద్దలలో ఒకని భార్య కావచ్చును!

3. ఊదారంగు పొడిని అమ్మే లూదియ వలన తుయతైర సంఘము స్థాపించబడెను.

4. సంబాతే అను సోదె చెప్పు స్త్రీ ఈ సంఘములో ప్రవేశించెనని, ఆమెయే ఈ యెజెబెలని మరి కొందరు తలస్తారు.

5. ఆమె ఎవరైనను, ఈ సంఘములో యున్న ఒక దుష్టస్త్రీ, ఆమె పాత నిబంధనలోని యెజెబెలు వలెనే దుర్మార్గురాలు. ఆమె వ్యాపార సంస్థలతో సంబంధము కలిగి యుండవచ్చును. ఈ సంస్థలలో విగ్రహాలుండేవి. వారు ఆ విగ్రహాలకు నైవేద్యములర్పిస్తు యుండేవారు, వాటిని తినుచు యుండేవారు. విగ్రహములకు అర్పించేవాటిని తినవచ్చునని ఆమె సంఘమును ప్రోత్సహించేది. అయితే విగ్రహము లకు బలి యిచ్చిన వాటిని తినరాదని పరిశుద్ధాత్ముడు నిషేధించారు (అపొ.కా. 15:20). పరిశుద్ధుల సభలలో స్త్రీలు మౌనముగా యుంటే, యిట్టి అక్రమక్రియలకు ప్రోత్సాహము లభించదు (I కొరింథీ 14:34;I తిమోతి 2:12-15).

C. ఈ సంఘములో కైసరు ఆరాధన లేదు. బయట నుండి ఏమిధమైన ఒత్తిడి లేదు గాని సమస్య అంతా సంఘము లోపలిదే.

D. క్రీస్తు యెజెబెలుకు ఆమె అనుచరులకు మారు మనస్సు పొందు తరుణం యిచ్చారు. ఆమె దానికి నిరాక రించింది. (2 పేతురు 3:9,15; రోమా 2:4;లూకా 13:3).

E. క్రీస్తు యెజెబెలును తన అనుచరులను శ్రమలను మంచము పట్టింతునని చెప్పారు. యిది వ్యభిచరించే మంచము కాదు. ఇక్కడ చెప్పబడిన

మంచము, రోగి యొక్క మంచము. యెజెబెలు దాని అనుచరులు బహుశ విందారగించు సమయంలో చంపబడి యుంటారు.

F. దానిని, దానిపిల్లలను నిశ్చయముగా చంపెదనని క్రీస్తు చెప్పారు. వారిని మరణానికి పాలుచేయును. క్రొత్త నిబంధకాలములో తమ ప్రాణములను కోల్పోయిన వారున్నారు (అపొ.కా. 5:1-11). పరిశుద్ధాత్మని మోసపుచ్చుటకు అబద్ధమాడినందున అననీయ సప్పీరాలు అపొస్తలుల పాదముల యొద్దపడి చచ్చిరి. మారుమనస్సు పొందనివారు నిశ్చయముగా చచ్చెదరు (యెహెజ్కేలు 18:20; రోమా 6:23; యాకో 1:15).

G. సంఘములన్నియు తెలిసికొనునట్లు క్రీస్తు ఈ పని చేస్తానన్నారు. సార్వజనికంగా యున్న సంఘము దీన్ని చూచి ఒక ప్రాముఖ్య పాఠము నేర్చుకోవాలని ప్రభువు కోరారు.

H. ఆయన హృదయములను పరీక్షించుచు యుండువాడని మనందరం తెలిసికోవాలి.

1. ఆయన అంతరింద్రియములను పరీక్షించువాడు, ఆయన మన హృదయములను, తలంపులను పరీక్షించువాడు (I సమూయేలు 16:7; సామె 4:23; 23:7).
2. ఆయన మనలో ప్రతివానికి వాని వాని క్రియల చొప్పున ప్రతిఫలమిచ్చును (గలతీ 6:7-8; హోషేయ 8:7; 2 కొరింథీ 5:10; సామె 22:8).

## IV. క్రీస్తు యొక్క హెచ్చరిక (24,24వ).

A. ఆయన 'తయతైరలో కడమ వారైన మీతో' అని చెప్పుచున్నారు. అంటే యెజెబెలును వెంబడింపని వారితో అని అర్ధము.

B. వారు సాతాను యొక్క గూఢమైన సంగతులను ఎరుగమని చెప్పుకొను వారు. తప్పుతెలిసి కోవాలంటే తప్పుచేయాలని చెప్పేవారుండేవారు.

C. మీపైని మరి ఏ భారము పెట్టనని ఆయన వారికి చెప్పారు. అపొ.కా. 15:28-29లో అపొస్తలులు చెప్పినట్లే ఆయన ఇక్కడ చెప్పారు. "విగ్రహములకు అర్పించిన వాటిని, రక్తమును, గొంతు పిసికి చంపిన దానిని, జారత్వమును విసర్జించవలెను. ఈ అవశ్యమైన వాటికంటె ఎక్కువైన భారమును మీ మీద మోపకూడదని, పరిశుద్ధాత్మకును, మాకును తోచెను" అని అపొస్తలులు

అన్యులలోనుండి క్రైస్తవులైన వారికి తాకీదు పంపిరి.

D. "నేను వచ్చు వరకు మీకు కలిగి యున్నదానిని గట్టిగాపట్టుకొనుడి" యని ప్రభువు వారికిచెప్పెను. ఏది ఏమైనను విశ్వాసమందు నిలకడగా యుండుడియని ప్రభువు వారిని హెచ్చరించారు.

**V. చివరిగా ప్రభువు వారికొక వాగ్దానము చేసారు (26-29వ).**

A. అది మనం ఎరిగియున్నదే. కీర్తన 2లో దేవుడు క్రీస్తుకు చేసిన వాగ్దానం అది. మెస్సీయను గూర్చి చెప్పబడిన కీర్తనలలో అదొకటి. క్రీస్తు ఇప్పుడు రాజ్యము చేయుచున్నారు. ఆయన రాజులకు రాజు, ప్రభువులకు ప్రభువు (ప్రక27:14). క్రైస్తవులు ఆ రాజరికములో ఇప్పుడు పాలి భాగస్థులు (రోమా 5:17;I కొరింథీ 6:2; 2తిమో 2:12). ఈ లోకం అంతమయినప్పుడు క్రీస్తు యొక్క విజయమహిమలో మనం పాలు పొందుదుము (రోమా 8:17).

B. జయించుచు యున్న వానికి పని చేయుచుయున్న వానికి ఈ బహుమతి ఇయ్యబడును.

C. అంతము వరకు నా క్రియలు జాగ్రత్తగా చేయువానికి జనుల మీద అధికారము ఇచ్చెదనని క్రీస్తు వాగ్దానము చేసెను. "ఇనుప దండములతో అతడు వారిని ఏలును".

D. అట్టివానికి వేకువ చుక్క నిచ్చెదనని క్రీస్తు వాగ్దానము చేసెను. ఈ వేకువ చుక్క యేసు క్రీస్తే: "నేను దావీదు వేరు చిగురును సంతానమును, ప్రకాశమానమైన వేకువ చుక్కయునై యున్నాను"(ప్రక 22:16).

**ముగింపు:**

క్రైస్తవులకు క్రీస్తు సంఘాలకు లోపలి నుండియే గొప్ప సవాళ్లు వచ్చును. బయటి శత్రువులందరినీ మనం జయించవచ్చును. సంఘము నాశనమైతే అది అంతరంగ సమస్యల వలనే నాశనమగును. దేవుడు అబద్ధబోధను సహించరు. సాతానుడు మన శత్రువు. సంఘములకు వ్రాయబడిన వర్తమానములలో తరచు వానిని గూర్చి చెప్పబడింది. దేవుడు పాపమునకు శిక్ష విధించకుండాయుండదు. మన విశ్వాసమునకు కలుగు ఫలములు నిత్యము మనం ఎదుర్కొనే సమస్యలు, పోరాటములన్నిటి కన్నా పరలోకము యొక్క విలువ గొప్పది.

-జాన్ స్టేసీ

## బైబిలు ప్రశ్నోత్తరి

1. మిద్యానీయుల తల్లి ఎవరు?
   కెతూర. ఆది.కా.25:1-4
2. మోషే యొక్క మామగారి పేరేమి?
   యిత్రో నిర్గమ 3:1
3. క్రొత్తనిబంధనలో ఒక స్త్రీకి వ్రాయబడిన పత్రిక యేది?
   2వ యోహాను
4. ఇశ్రాయేలీయులలో ఏకైక న్యాయాధిపతియైన స్త్రీ ఎవరు?
   దెబోరా. న్యాయాధి 4:4-5
5. యూదా రాజొకడు త్రాగి మత్తుడైయుండగా జిమ్రీచేత చంపబడెను. అతడెవరు?
   ఏలా. I రాజులు 16:8-10
6. యూదా రాజ్యమును పాలించిన ఆఖరి రాజు ఎవరు?
   సిద్కియా. II రాజులు 23
7. ప్రవక్తయైన బిలామును ఇశ్రాయేలీయులను శపింపమని కోరిన మోయాబు రాజు ఎవరు?
   సిప్పోరుకుమారుడైన బాలకు. సంఖ్యాకాండము 23వ అధ్యాయం.
8. బైబిలులో అన్నిటికంటే మొదటి ఆజ్ఞయేది?
   "మీరు ఫలించి అభివృద్ధిపొంది భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి. సముద్రపు చేపలను ఆకాశ పక్షులను, భూమి మీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని" దేవుడు వారితో చెప్పెను (ఆదికా. 1:28).
9. ఇశ్రాయేలీయుల మొదటి న్యాయాధిపతి ఎవరు?
   కాలేబు తమ్ముడైన ఒత్నీయేలు. న్యాయా 3:9
10. బైబిలులో చెప్పబడిన మొట్టమొదటి ఊరు పేరేమి?
   హానోకు ఆది.కా.4:17
11. దిగంబరియై మూడు సంవత్సరములు ప్రవచించిన ప్రవక్త ఎవరు?
   ఆమోజుకుమారుడైన యెషయా. యెషయా 20:3

12. మెతూషెల 969 సంవత్సరములు బ్రదుకగా అతని తరువాత ఎక్కువ సంవత్సరములు బ్రదికిన వ్యక్తి ఎవరు?

యెరెదు 962 సంవత్సరములు. ఆది కా. 5:20

13. ఇశ్రాయేలీయుల రెండవరాజు ఎవరు? (అతడు దావీదుకాదు)

నేరుకుమారుడైన అబ్నేరు II సమూయేలు 2:8-10

14. పౌలు బర్నబాలు మొదట కలసి ప్రయాణము చేసిరి. పౌలుతో రెండవసారి ప్రయాణం చేసినదెవరు?

సీల. అపొ.కా. 15:40-41

15. సొలొమోనురాజు మొదట దేవుని ఆలయమును కట్టించెను. రెండవసారి దానిని పున:నిర్మించిన దెవరు?

యోజాదాకు కుమారుడైన యెషూవయు యాజకులైన అతని బంధువులును, షయల్తీయేలు కుమారుడైన జెరుబ్బాబెలు.

– రిక్కీ గూటం

RNI Regd. No. 6997/98
Postal Regd. No. AP/KD-02/2006-2008

To

From:

**SATYA VAKKU**
P.O. Box 80, Kakinada - 533 001

Edited & Published by Joshua Gootam Printed by him at Satya Vani Publication, Sambhamurthy St. Kakinada - 533 004